సాక్షి కాకినాడ

బుధవారం । 13 । ఆగస్టు । 2025



రూ.లక్ష విరాళం


అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి కొలగాని వీవీఎస్ మూర్తి, రత్నశ్రీ దంపతులు (కాకినాడ) మంగళవారం రూ.లక్ష విరాళం సమర్పించారు.



రేపటి నుంచి రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్

పిఠాపురం: రేపటి నుంచి ఈ నెల 17 వరకూ పిఠాపురంలో రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు తెలిపారు.

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం సాయంత్రం 1,18,431 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. గోదావరి డెల్టా కాలువలకు 12,950 క్యూసెక్కులు విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 4,200, మధ్య డెల్టాకు 2,250, పశ్చిమ డెల్టాకు 6,500 క్యూసెక్కుల చొప్పున వదిలారు.

న్యూస్‌రీల్

సంపద తయారీ కేంద్రాలపై దృష్టి సారించాలి



శిక్షణలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ

సామర్లకోట: గ్రామాల్లోని సంపద తయారీ కేంద్రాలపై ఎంపీడీఓలు దృష్టి సారించాలని జిల్లా పరిషత్తు సీఈఓ వీవీఎస్ లక్ష్మణరావు, జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్ అన్నారు. జిల్లాలోని 20 మంది ఎంపీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓలకు జి.మేడపాడు గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఒక రోజు శిక్షణలో వారు మాట్లాడారు. ప్రతి ఇంటి నుంచీ తడి, పొడిచెత్త సేకరించి, వర్మి కంపోస్టు యూనిట్లకు తరలించాలన్నారు. తడి చెత్త నుంచి వర్మి కంపోస్టు తయారు చేసి, దాని వినియోగంపై రైతులకు అవగాహన కల్పించడం ద్వారా పంచాయతీలకు ఆదాయం వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో పెద్దాపురం డీఎల్‌డీఓలు వాసుదేవరావు, శ్యామల, డీఎల్‌పీఓలు అన్నామణి, బాలమణి, సామర్లకోట ఎంపీడీఓ కె.హిమమహేశ్వరి, సర్పంచ్ పటాని దేవి తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ పోటీల్లో విజేతలుగా హైదరాబాద్ జట్లు

సామర్లకోట: రెండు తెలుగు రాష్ట్రాల మధ్య నిర్వహించిన పెద్దాపురం శ్రీ ప్రకాష్ సినర్జీ పాఠశాలలో నాలుగు రోజులుగా నిర్వహించిన బాస్కెట్‌బాల్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. రెండు రాష్ట్రాల నుంచి 140 జట్లు పోటీల్లో పాల్గొనగా 1,500 మంది క్రీడాకారులు హాజరైనట్లు శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాలల డైరెక్టర్ సీహెచ్ విజయప్రకాష్ తెలిపారు. అండర్-14, అండర్-17, అండర్-19 విభాగాల్లో హైదరాబాద్‌కు చెందిన జట్లు విన్నర్స్, రన్నర్స్‌గా నిలిచారు. విజేతలకు డీసీసీబీ చైర్మన్ తుమ్మలబాబు బహుమతులు అందజేశారు. ఆర్గనైజింగ్ కార్యదర్శి డి.చక్రవర్తి, విజయప్రకాష్ మాట్లాడారు.

పిఠాపురంలో.. చోర సైనికులు?



జనసేన కార్యకర్తలు ఎత్తుకుపోయిన లారీలు



ఎమ్మెల్సీ నాగబాబుతో నాగిరెడ్డి నాగ సతీష్



పిఠాపురం జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డితో బెల్లంకొండ రవితేజ



కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్‌తో గంజి సురేష్

- పోలీసులు తీగ లాగితే.. కదిలిన జనసేన డొంక
- లారీల చోరీలో పట్టుబడిన ఆరుగురు
- పరారీలో ఉన్న మరో ఇద్దరిని తప్పించాలంటూ ఒత్తిళ్లు
- అందరూ ఆ పార్టీ క్రియాశీలక కార్యకర్తలే..
- కీలక నేతలకు సన్నిహితులే..
- నిందితుల్లో ముగ్గురు నేరచరితులేనన్న సీఐ
- కలకలం రేపుతున్న దొంగల ముఠా బాగోతం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: 'తప్పు చేసిన వాడిని తరిమితరిమి కొడతా.. బట్టలూడదీసి రోడ్డు మీద నడిపిస్తా.. తోలు తీస్తా.. తాట తీస్తా..' అంటూ గత సార్వత్రిక ఎన్నికల ముందు జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ గర్జించారు. పిఠాపురం నుంచి ఎమ్మెల్యేగా గెలిచి, కూటమి ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రి కూడా అయ్యారు. అంతే ఏడాది తిరిగేసరికి పిఠాపురంలో సీన్ రివర్స్ అయిపోయింది. చిన్న తప్పు జరిగినా ఉపేక్షించనని కుండబద్దలు కొట్టిన పవన్ ఇలాకాలోనే జనసేన శ్రేణులు దొంగతనాలకు కూడా వెనుకాడటం లేదు. అధికారం అండతో చెలరేగిపోతున్నారు. అటువంటి దొంగలను.. పవన్ వెంట తిరిగే ఆ పార్టీ ముఖ్య నేతలు వెనకేసుకు తిరుగుతూండటం చూసి పిఠాపురం ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.

లారీల చోరీలు

పిఠాపురం కుంతీ మాధవస్వామి గుడి వద్ద దగ్గు అప్పారావు నిలిపి ఉంచిన వంట నూనెల లారీని ఈ నెల 5న గుర్తు తెలియని దుండగులు ఎత్తుకుపోయారు. ఈ లారీ కోసం పోలీసులు తీగ లాగితే జనసేన డొంక మొత్తం కదిలింది. పోలీసు విచారణలో వంట నూనెల లారీయే కాకుండా ఆకుల ప్రసాద్‌కు చెందిన నూకల లోడుతో ఉన్న మరో లారీ కూడా మాయమైందని తేలింది. ఆగంతకులు ఎత్తుకుపోయింది ఒక లారీ అనుకుని పోలీసులు విచారణ మొదలు పెడితే రెండో లారీ విషయం కూడా వెలుగులోకి వచ్చింది. ఈ రెండు లారీల్లో సరకు విలువ రూ.కోటి పైమాటేనని పోలీసులు ప్రాథమికంగా లెక్క తేల్చారు.

ఎత్తుకుపోయింది జనసేన కార్యకర్తలే..

ఈ లారీలు ఎత్తుకుపోయింది అంతర్రాష్ట్ర దొంగలనుకునుకున్న పోలీసులు తొలుత ఆ దిశగా విచారణ ప్రారంభించారు. వాహనాలకున్న జీపీఎస్ ట్రాకింగ్ ద్వారా ఆరు రోజుల పాటు కూపీ లాగి, చివరకు ఆ రెండు లారీలనూ పట్టుకున్నారు. తీరా, ఈ రెండు లారీలూ ఎత్తుకుపోయింది ఎనిమిది మంది జనసేన క్రియాశీలక కార్యకర్తలేనని తెలిసి నివ్వెరపోవడం పోలీసుల వంతు అయ్యింది. లారీలు ఎత్తుకుపోయిన దొంగల ముఠాలో ఉన్న పిఠాపురం పట్టణంలోని బొజ్జావారితోట, కోటగుమ్మం, లయన్స్ క్లబ్ ప్రాంతాలకు చెందిన బెల్లంకొండ రవితేజ, నాగిరెడ్డి నాగ సతీష్, గంజి సురేష్, కాకినాడ రూరల్ మండలం పండూరుకు చెందిన నందిపాటి వీర సుబ్రహ్మణ్యాలను అరెస్టు చేశారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారని పోలీసులు చెబుతున్నారు.



జనసేన కార్యకర్తలు ఎత్తుకుపోయిన లారీలు

నేతల ఒత్తిళ్లు

పోలీసులకు పట్టుబడ్డ ఎనిమిది మందీ జనసేన ముఖ్య నేతలు వెంటేసుకుని తిరుగుతున్న క్రియాశీలక కార్యకర్తలేనని తేలడంతో ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. జనసేనలో లారీలు ఎత్తుకుపోయే దొంగల ముఠా గుట్టు రట్టవడం జిల్లావ్యాప్తంగా ఆ పార్టీలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ కేసులో పిఠాపురం పోలీసుల పరిస్థితి ముందు నుయ్యి.. వెనుక గొయ్యి అన్న చందంగా తయారైంది. నిందితులను తప్పించేందుకు ఆ పార్టీలో కాకినాడ, పిఠాపురానికి చెందిన ఇద్దరు ముఖ్య నేతలు పోలీసులపై తీవ్రమైన ఒత్తిడి తీసుకువచ్చారు. ఈ క్రమంలోనే ఇద్దరిని ముందే తప్పించేశారనే విమర్శలు వస్తున్నాయి. పరారీలో ఉన్న ఇద్దరినీ తప్పించాలని లేదంటే ప్రత్యామ్నాయమైనా ఆలోచించాలంటూ తీవ్ర స్థాయిలో ఒత్తిళ్లు తెస్తూండటంతో పోలీసులు తలలు పట్టుకుంటున్నారని చెబుతున్నారు.

వారికి నేర చరిత్ర

లారీల చోరీల్లో పట్టుబడిన బెల్లంకొండ రవితేజ, నాగిరెడ్డి నాగ సతీష్, గంజి సురేష్‌లకు నేర చరిత్ర ఉందని అరెస్టు సందర్భంగా పిఠాపురం సీఐ శ్రీనివాస్ మీడియాకు చెప్పారు. ఈ ముగ్గురూ జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్‌తో సన్నిహితంగా ఉంటూ ఆ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేవారని పిఠాపురం కోడై కూస్తోంది. అక్కడి జనసేన నాయకులతో కూడా వీరు సత్సంబంధాలు కలిగి ఉన్నారనే చెబుతున్నారు. అలాగే, పార్లమెంటు నాయకుడు, పవన్ కల్యాణ్ అన్న, ఎమ్మెల్సీ నాగబాబు వెంట కూడా ఉంటారు. నాలుగో నిందితుడైన నందిపాటి వీర సుబ్రహ్మణ్యం కూడా జనసేన పార్టీలో చురుకుగా ఉండటం గమనార్హం. నేర చరిత్ర ఉన్న విషయం తెలిసినా ఇంత కాలం వారిని పార్టీ కార్యక్రమాల్లో ఎలా ప్రోత్సహించారని ఆ పార్టీలోని ద్వితీయ శ్రేణి నేతలు ప్రశ్నిస్తున్నారు. పార్టీ ముఖ్య నేతల అండదండలు చూసుకునే వారు ఈ తరహా 'ఘనకార్యాలకు' బరి తెగించారని పార్టీలో విస్తృతమైన చర్చ జరుగుతోంది.

పవన్ ఏమంటారో..

జనసేన అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ చెప్పే మాటలకు.. ఆ పార్టీ నేతలు, కార్యకర్తల తీరుకు అసలు పొంతనే కుదరడం లేదు. గత ఏడాది గొల్లప్రోలులో నిర్వహించిన బహిరంగ సభలో పవన్ మాట్లాడుతూ, 'శాంతిభద్రతలకు విఘాతం కలుగుతోంది, అవసరమైతే నేనే హోం మంత్రి అయి చక్కదిద్దాల్సి ఉంటుంది' అని ఆవేశంగా చెప్పుకొచ్చారు. జనవరి 10న సంక్రాంతి సంబరాల సందర్భంగా జరిగిన సభలో 'పిఠాపురంలో గంజాయి, రౌడీయిజం, దొంగతనాలు పెరిగిపోతున్నాయని స్థానికుల ద్వారా తెలిసింది. వీటిని నియంత్రించకుంటే చర్యలు తీవ్రంగా ఉంటాయి' అంటూ పోలీసులకు పవన్ ఏకంగా వార్నింగ్ కూడా ఇచ్చేశారు. ఇప్పుడు తన వెన్నంటి తిరిగే జిల్లా ముఖ్య నేతల కనుసన్నల్లో ఉండే అనుచరులు లారీలు ఎత్తుకుపోయే దొంగల ముఠాగా పోలీసు దర్యాప్తులో వెల్లడి కావడంపై పవన్ ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

కొన ఊపిరికి కొత్త ఊపిరి

- ధన్య చరితులు.. పుణ్యమూర్తులు
- వారి త్యాగం చైతన్యానికి ప్రతీక
- కన్ను మూస్తూ.. మరొకరికి జన్మనిస్తున్న దాతలు
- నేడు ప్రపంచ అవయవదాన దినోత్సవం



ఈ ఏడాది మే 28న బ్రెయిన్ డెత్‌తో అవయవదానం చేసిన శివన్నారాయణ మృతదేహానికి నివాళి అర్పిస్తున్న మండపేట నియోజకవర్గ నాయకులు (ఫైల్)

కపిలేశ్వరపురం: ఆలోచన అయినా ఆచరణ అయినా బొందిలో ప్రాణం ఉన్నంత వరకే. మరణించిన వ్యక్తి కుటుంబ సభ్యులు తీసుకొన్న సామాజిక అవగాహనతో కూడిన నిర్ణయాలు మరణించిన వ్యక్తిని మరెన్నో తరాలు జీవించేలా చేస్తాయి. అలాంటి కోవలోకి వచ్చే అవయవదానం సామాజిక చైతన్యానికి ప్రతీకగా నిలుస్తోంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎంతోమంది తమ అవయవాలను దానం చేసి ఎంతోమందికి ప్రాణం పోశారు. నేడు ప్రపంచ అవయవదాన దినోత్సవం సందర్భంగా ఈ కథనం...

పెరిగిన అవసరం

భారతదేశంలో అవయవాలు సకాలంలో అందుబాటులో లేక రోజుకు 20 మంది చొప్పున చనిపోతున్నారని అంచనా ఉంది. ప్రతి పది నిమిషాలకు ఒకరు అవయవ మార్పిడి చేయించుకోవాల్సిన పరిస్థితి దేశంలో ఉంది. అవయవాలు అవసరమైన వారిలో పది శాతం మందికి కూడా అవి లభ్యం కావడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో అవయవదానం ప్రాధాన్యం పెరిగింది. సాహితీవేత్తలు, కమ్యూనిస్టు పార్టీ నాయకులు, సామాజిక కార్యకర్తలు మరణానంతరం తమ దేహాలను దానం చేస్తూ అంగీకార పత్రాలను రాసిన చరిత్ర ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకి ఉంది.

చేయడం ఇలా.. : దాతలు జీవిస్తూనే వారి అవయవాలలో కొంత భాగాన్ని దానం చేస్తూ ఇతరులకు ఊపిరి పోస్తున్నారు. రక్తాన్ని, 50 శాతం కాలేయాన్ని, రెండింటిలో ఒక కిడ్నీని ఇతరులకు దానం చేయడం ఈ కోవలోనివే. మరొక పద్ధతిలో వారు చనిపోయిన తర్వాత కుటుంబ సభ్యుల నిర్ణయంతో అవయవాలు దానం చేస్తున్నారు. బ్రెయిన్ డెత్ అయిన వ్యక్తుల్లో మొత్తం రెండు కిడ్నీలను, గుండెను, కాలేయాన్ని, ఊపిరితిత్తులను, ప్యాంక్రియాసిస్ గ్రంధిని వాటి పనితీరు సామర్థ్యాన్ని బట్టి ఇతరులకు దానం చేస్తున్నారు. తన దేహాన్ని మరణానంతరం వైద్య కళాశాల విద్యార్థుల పరిశోధన కోసం కళాశాలకు అప్పగించాలంటూ కొందరు ముందస్తు ఒప్పంద పత్రాన్ని రాస్తున్నారు. సహజ మరణం పొందిన వారి నుంచి కార్నియా, చర్మం, ఎముక, గుండె కవాటాలు, రక్తనాళాలు దానం చేసే వీలు ఉంది.

బ్రెయిన్ డెత్ కావడంతో...

మండపేట మండలం ద్వారపూడి గ్రామానికి చెందిన యువకుడు సున్న శివన్నారాయణ (శివ) ఈ ఏడాది మే 25న రాజమహేంద్రవరం – ద్వారపూడి రహదారిలో ప్రమాదానికి గురికావడంతో బ్రెయిన్ డెత్ అయ్యింది. కుటుంబ సభ్యుల నిర్ణయంతో కాకినాడ ట్రస్ట్ ఆసుపత్రిలో అతని అవయవాలను దానం చేయడం ద్వారా ముగ్గురికి జీవితాన్ని ప్రసాదించాడు. లివరు, ఒక కిడ్నీని ట్రస్ట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి, మరో కిడ్నీని విశాఖపట్నం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి అమర్చారు. రెండు నేత్రాలలోని కార్నియాలను కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్‌కు దానం చేశారు.

చిరంజీవులయ్యారు

మండపేట మండలం అర్తమూరు గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు కాకర శ్రీనివాసరావు ఈ ఏడాది జూలై 12న గుండెపోటుతో మృతిచెందగా ఆయన నేత్రాలను అనపర్తి రాధాకృష్ణ ఐ బ్యాంక్‌కు దానం చేశారు. తాళ్ళరేవు మండలం పి.మల్లవరం గ్రామానికి చెందిన ధూలిపూడి సీతారాం అనే మహిళ ఈ ఏడాది జులై 1న గుండెపోటుతో మరణించగా నేత్రదానం చేశారు. తాళ్లరేవు మండలం వూడా హిమావతి ఈ ఏడాది జనవరి 26న గుండెపోటుతో మరణించడంతో రెండు నేత్రాలను కాకినాడ బాదం ఐ బ్యాంక్‌కు దానం చేశారు. ద్రాక్షారామ పద్మ స్టూడియో అధినేత కె.వీర్రాజు ఈ ఏడాది మే 28న మృతి చెందగా కాకినాడ రెడ్ క్రాస్ ఐ బ్యాంకుకు రెండు కార్నియాలను దానం చేశారు. కరప మండలం పెనుగుదురు గ్రామానికి చెందిన పలపకూర వెంకట్రావు ఏడాది ఏప్రిల్ 26న గుండెపోటుతో మరణించగా కాకినాడ రెడ్ క్రాస్ ఐ బ్యాంకుకు రెండు కార్నియాలను దానం చేశారు. కె.గంగవరం గ్రామానికి చెందిన చింత చిన్నారి ఈ ఏడాది ఫిబ్రవరి 27న మృతి చెందగా రెండు నేత్రాలను కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంకుకు దానం చేశారు.

నాన్న స్ఫూర్తితో దేహదానం చేశాం



నాన్న మానవ సమాజం పట్ల అవగాహనతో జీవించారు. నా చిన్ననాటి నుంచీ అనేక విషయాలు బోధించారు. ఆయనతో పాటు అమ్మకు అవగాహన కల్పించి ఆమె దేహాన్ని కూడా దానం చేసేందుకు చైతన్య పర్చారు. ఆ స్ఫూర్తితో నేను, నా జీవిత భాగస్వామి కల్యాణి కూడా దేహదానం చేసేందుకు పత్రం రాశాం.

– మేకా గౌరవ్, పిఠాపురం, కాకినాడ జిల్లా

వైద్య విద్యార్థుల పరిశోధన లక్ష్యంగా..

కపిలేశ్వరపురం మండలం అంగరకు చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు, ఆలయ శిల్పి పెద్దింశెట్టి సూర్యనారాయణమూర్తి (91) 2021 డిసెంబర్ 8న వృద్ధాప్యంతో మృతి చెందారు. ఆయన జీవించి ఉండగానే 2009 నవంబర్ 22న కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాలకు దేహదాన ఒప్పంద పత్రాన్ని రాసి ఇచ్చారు. కుటుంబ సభ్యులు ఆ మేరకు సూర్య నారాయణమూర్తి దేహాన్ని కళాశాలకు అప్పగించారు. పిఠాపురానికి చెందిన ప్రముఖ సాహితీవేత్త, వజ్రాయుధం పుస్తక రచయిత ఆవంత్స సోమసుందర్ 2016 ఆగస్టు 12న వృద్ధాప్యంతో మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులు కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాలకు దేహాన్ని అప్పగించారు. పిఠాపురం పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త మేకా సత్యనారాయణ శాస్త్రి (బాంబు) తానూ, తన భార్య అనూరాధ ఇద్దరూ తమ దేహాలను వైద్య కళాశాలకు రాసి ఇచ్చారు. కాగా 2022 ఫిబ్రవరి 28న నేషనల్ సైన్స్ డే రోజున సత్యనారాయణశాస్త్రి గుండెపోటుతో మరణించగా కుటుంబ సభ్యులు రాజానగరం జీఎస్ఎల్ కళాశాలకు దేహాన్ని అప్పగించారు. ఆ స్ఫూర్తితో ఆదేరోజు సత్యనారాయణ శాస్త్రి కుమారు డు గౌరవ్, కోడలు కల్యాణిలు తమ దేహాలను దానం చేసేందుకు ఒప్పంద పత్రాలను రాసి ఇచ్చారు.

ముగిసిన జాతీయ జూనియర్ మహిళా హాకీ పోటీలు



జాతీయ మహిళా జూనియర్ హాకీ పోటీల విజేత జార్ఖండ్ జట్టు

- విన్నర్స్ జార్ఖండ్
- రన్నర్స్ హర్యానా
- మూడోస్థానం ఉత్తరప్రదేశ్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా క్రీడామైదానంలో జరుగుతున్న 15వ ఇండియన్ ఆయిల్ జాతీయ జూనియర్ మహిళల హాకీ పోటీల విజేతగా జార్ఖండ్ జట్టు నిలిచింది. మంగళవారం నిర్వహించిన ఫైనల్స్‌లో జార్ఖండ్, హర్యానా జట్లు పోటీ పడగా 2-1 స్కోర్‌తో జార్ఖండ్ జట్టు విజయం సాధించి చాంపియన్ షిప్‌ను కైవసం చేసుకుంది. రన్నర్స్‌గా హర్యానా జట్టు నిలిచింది. మూడో స్థానానికి నిర్వహించిన మ్యాచ్‌లో ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ పోటీపడగా ఉత్తరప్రదేశ్ 2-0 స్కోర్‌తో విజయం సాధించి తృతీయ స్థానంలో నిలిచింది. క్రీడామైదానంలో సాయంత్రం నిర్వహించిన బహుమతి ప్రదాన కార్యక్రమంలో కలెక్టర్ షణ్మోహన్, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, ఎస్పీ బిందుమాధవ్ అతిథులుగా విచ్చేసి బహుమతులు అందజేశారు. ఈ నెల 1 నుంచి 12 వరకు నిర్వహించిన పోటీల్లో 29 రాష్ట్రాల నుంచి 600 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారుల నుంచి 30 మందిని ప్రపంచ పోటీలకు ప్రాబబుల్స్‌గా ఎంపిక చేశారు. డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్, హాకీ ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ నిరంజన్, కార్యదర్శి హర్షవర్ధన్, కోశాధికారి థామస్ పీటర్, భవానీ శంకర్, టోర్నీ కో-ఆర్డినేటర్ వి.రవిరాజు, సీపోర్టు సీఈఓ మురళీధర్ పాల్గొన్నారు.



సీనియర్ హాకీ క్రీడాకారిణి శేషుకుమారిని సత్కరిస్తున్న కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ బిందుమాధవ్ తదితరులు

విశ్రాంతి షెడ్డు నిర్మాణానికి సంసిద్ధత

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ఆలయ పశ్చిమ రాజగోపురం ముందు భారీ విశ్రాంతి షెడ్డు నిర్మాణానికి విశాఖపట్నానికి చెందిన లారెస్ ఫార్మాస్యూటికల్స్ సంసిద్ధత వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వీవీ రవికుమార్ దేవస్థానానికి మంగళవారం లేఖ పంపించారు. సుమారు రూ.1.5 కోట్ల వ్యయంతో 125 అడుగుల పొడవు, 100 అడుగుల వెడల్పున 12,500 చదరపు అడుగుల విస్తీర్ణంలో టెన్సిల్ షెడ్డు నిర్మించేందుకు ఆ సంస్థ ముందుకొచ్చింది. సుమారు 3 వేల మంది భక్తులు ఈ షెడ్డులో సేద తీరే అవకాశం ఉంది. రాత్రి వేళ కూడా విశ్రాంతి తీసుకునే వీలుంటుంది. వసతి గదుల కోసం భక్తుల నుంచి ఒత్తిడి కూడా తగ్గుతుంది. ఈ షెడ్డులో భక్తుల కోసం వ్రతాలు, దర్శనం, ప్రసాదం కౌంటర్లు కూడా ఏర్పాటు చేయనున్నారు. పెద్దపెద్ద హెలికాప్టర్ ఫ్యాన్లు కూడా అమర్చనున్నారు. ఈ ప్రతిపాదనను త్వరలోనే దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ దృష్టికి తీసుకువెళ్లి, షెడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని అన్నవరం దేవస్థానం అధికారులు తెలిపారు. ఇప్పటి వరకూ పశ్చిమ రాజగోపురం ఎదురుగా నిలువ నీడ లేక భక్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఎండాకాలంలో అక్కడి చెట్ల కిందనే తలదాచుకోవాల్సిన దుస్థితి. అదే వర్షాకాలమైతే తడిసి ముద్దవుతున్నారు. షెడ్డు నిర్మాణం జరిగితే భక్తులకు ఈ బాధలు తప్పుతాయి.

22న ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

శ్రావణమాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని ఈ నెల 22వ తేదీ ఉదయం 8 గంటలకు సత్యదేవుని సన్నిధిలో సామూహిక ఉచిత వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నారు. మహిళలు ఎక్కువగా వస్తే నైరుతి, వాయువ్య వ్రత మండపాల్లో కూడా ఈ వ్రతాలు నిర్వహిస్తారు. 4 వేల మందికి పైగా మహిళలు వచ్చే అవకాశం ఉందనే అంచనాతో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ వ్రతమాచరించేందుకు వచ్చే మహిళలు గాజులు, పూలు, అరటి పండ్లు, రెండు కొబ్బరి కాయలు తెచ్చుకోవాలి. మిగిలిన పూజాద్రవ్యాలన్నింటినీ దేవస్థానమే అందజేస్తుంది.